International Journal of
Multidisciplinary Trends

**E-ISSN:** 2709-9369
**P-ISSN:** 2709-9350
www.multisubjectjournal.com
IJMT 2022; 4(1): 262-267
Received: 28-03-2022
Accepted: 15-04-2022

**డా|| వి.నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

**Corresponding Author:**
**డా|| వి నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

# జానపద వచన కథ - వైశిష్ట్యం

## డా|| వి.నారాయణప్ప

**అమూర్త**

జానపద సాహిత్యం అనేది జానపద విజ్ఞానంలో ఒక భాగం. ఈ జానపద సాహిత్య విభాగంలో జానపద గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు చేరుతాయి. జానపద విజ్ఞానంలోని ప్రతి అంశాన్ని వర్ణించుటకు, ప్రబోధించుటకు సాహిత్యం ఒక సాధనంగా ఉపకరిస్తుంది. మానవుని బుద్ధి ఆలోచించడానికి మొదలు పెట్టినప్పటి నుండే కథాకథనం ప్రారంభమైంది. మన భరతఖండంలో ప్రాచీన మహర్షులు కథల రూపంలో తమ శిష్యులకు ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక విలువలను బోధిస్తూ, విజ్ఞానాన్ని తరతరాలకు అందిస్తూ వచ్చారు. లిఖిత సాహిత్యంలోని కథలు, మౌఖిక సాహిత్యంలోని కథలు కొన్ని వేరు వేరు లక్షణాలు కలిగి ఉంటాయి. జానపద వచన కథలను ఎందరో పండితులు ఎన్నో విధాలుగా వర్గీకరించారు. ప్రపంచ జానపద వచన కథా సాహిత్యం మీద సమగ్రమైన అధ్యయనం జరిగింది. ఈ అధ్యయనాల ఆధారంగా జానపద కథల లక్ష్య-లక్షణాలను, జానపద కథకుని లక్షణాలను, జానపద శ్రోత లక్షణాలను ఈ పరిశీలన వ్యాసంలో వివరించాను చూడవచ్చు.

**కీలక పదాలు:** జనపదం, జానపదులు, జానపద విజ్ఞానం, జానపద సాహిత్యం, వర్గం, జానపద కథకుడు, జానపద శ్రోత.

## 1. పరిచయము

జనపద మంటే పల్లెటూరు. జనపదాలలో నివసించే ప్రజలు జానపదులు. జనపదము, జానపదులు అనేవి సంస్కృత పదాలు. తెలుగులో వీటినే పల్లె, పల్లీయులు అంటున్నాం. జానపదులకు సంబంధించినది జానపదం. అంటే జానపద సంస్కృతి, జానపద జీవనం, జానపద విజ్ఞానం వేరు వేరు కాదు పరస్పర సంబంధితాలు.

మారుతున్న కాలానికి అనుగుణంగా పల్లీయులు కూడా నగరాలకు జీవనోపాధి కొరకు వలసలు పోతున్నారు. అంటే జానపదులు ఎక్కడ నివసించినా అక్కడ జానపదత్వం ఉంటుందన్న విషయం నగ్న సత్యం.

జనపదాలలో నివసించు ప్రజల విజ్ఞానమే జానపద విజ్ఞానమని నిర్వచిస్తే జీవనోపాధి కొరకు అనేక ప్రాంతాలకు తరలివెళ్ళి, వలసపోయి, స్థిరపడిన ప్రజలు ఆచరిస్తున్న వారి పూర్వ ఆచారాలు, సంప్రదాయాలు జానపదమవుతుందా లేదా అని ఆధునిక జానపద విజ్ఞానులు ఆలోచించారు. కావున గిరిజనులలోను, జన పదాలలో నివసించు ప్రజలలోను, నగరాలలో నివసించు ప్రజలలోను జానపదత్వ ముంటుందన్నది అక్షర సత్యం. కనుక జానపదత్వాన్ని పరిరక్షించుకొను ప్రజల విజ్ఞానం జానపద విజ్ఞానం అని నిర్వచించటం సమంజసంగా ఉంటుందనేది అనేక మంది జానపద విజ్ఞానవేత్తల అభిప్రాయం.

జానపద సాహిత్యం, జానపదుల చేత, జానపదుల కొరకు సృష్టించబడిందని చెప్పవచ్చు. ఎందుకంటే జానపదులలో జానపదత్వమే కాక తత్సంబంధ "జ్ఞానపదత్వం" కూడా గోచరిస్తుంది. అందువల్లనే వేదవ్యాసుల వారు "కృత యజ్ఞశ్చమేధా విబుధో జ్ఞానపదశ్చుచిః" అని జానపదులను యజ్ఞం చేసిన వారితోను, పండితులతోనూ సమానమైన వారిగా భావించారు.

మానవుడు తనను తాను మరచిపోయి అనిర్వచనీయ జగత్తులో విహరించడానికి ప్రయత్నం చేస్తుంటాడు. అందువల్లనే తైత్తరీయోపనిషద్వాణి "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" ఆనందమే బ్రహ్మ అనే సత్యాన్ని ఉద్ఘోషిస్తున్నది.

జానపద సాహిత్యం అన్నది జానపద విజ్ఞానంలో ఒక భాగం. మౌఖిక జానపద విజ్ఞానాన్నే మనం జానపద సాహిత్యంగా పిలుస్తున్నాం. ఈ విభాగంలో జానపద గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు చేరుతాయి. "సహితేన హితం సాహిత్యం"- హిత సహితమైనదే సాహిత్యమైతే జానపద సాహిత్యం కంటే ఉత్తమ సాహిత్యం లేదు. జానపద విజ్ఞానంలోని ప్రతి అంశాన్ని వర్ణించుటకు, ప్రబోధించుటకు సాహిత్యం ఒక సాధనంగా ఉపకరిస్తుంది. జానపదుల భౌతిక జీవనాన్నే గాక, వారి మనః ప్రవృత్తికి చెందిన వివిధ అనుభూతులను, భావాలను సాహిత్యం హృదయంగమంగా చిత్రిస్తుంది. కనుక జానపద సాహిత్యాన్ని జానపద విజ్ఞానంలోని అంతర్భాగంగా గాక "విజ్ఞాన ప్రబోధ సాధకంగా" ప్రకటించుటయే సమంజసం.

మానవుని బుద్ధి ఆలోచించడానికి మొదలుపెట్టినప్పటి నుండే కథా కథనం ప్రారంభమైందని చెప్పవచ్చు. భారతీయ తత్త్వ చింతన కాధారాలైన ఉపనిషత్తులు, ఇతిహాసాలు, కథలకు మూలకందాలైనవి. అంటే కథా కథన కుతూహలం, కథా శ్రవణానందం అనుశ్రుతంగా వస్తున్న సంప్రదాయం, కథలు విజ్ఞాన, వినోద భరితాలు. పవిత్ర క్షేత్రమైన మన భరత ఖండంలో ప్రాచీన మహర్షులు, దివ్యజ్ఞాన సంపన్నులు, దయాళువులైన మహర్షులు కథల రూపంలో తమ శిష్యులకు ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక విలువలను బోధిస్తూ, విజ్ఞానాన్ని తరతరాలకు అందిస్తూ వచ్చినారు.

మానవుడు జీవితంలో తాను అనుభవించిన కష్టసుఖాలను తాను ఊహించిన సన్నివేశాలను జీర్ణించుకొని వాటికి చక్కని రూపకల్పన చేసి కథలల్లుకొని, తోటి మానవులతో తన అనుభూతులను పంచుకోవడానికి చిరకాలం నుండి ప్రయత్నిస్తున్నాడు. శ్రోత కూడా తన మదిలో ప్రోది చేసుకున్న ఊహలకూ, కథకుడు ఊహించిన ఊహల సారూప్యతకూ, సామీప్యతకూ దగ్గర సంబంధం ఉండటం వల్ల అమితానందంలో లీనమవుతున్నాడు.

లిఖిత సాహిత్యంలోని కథలు, మౌఖిక సాహిత్యంలోని కథలు కొన్ని వేరు వేరు లక్షణాలు కలిగి ఉంటాయి. లిఖిత సాహిత్యంలోని కథలు కొన్ని జానపదుల హృదయాలపై ముద్రవేసినట్లే మౌఖిక సాహిత్యంలోని కథలు కూడా రచయితల హృదయాలపై ముద్రవేసి కొత్త

కొత్త రూపాలను సంతరించుకున్నాయి. ప్రాచీన కాలం నుండే ఈ రెండు సంప్రదాయాలు వేరు వేరుగా ఉన్నప్పటికీ, ఒక దాని ప్రభావం మరొక దానిపై గాఢంగా ఉన్నది.

సర్వమానవ వాఙ్మయానికి, ధర్మానికి, సంస్కృతికి మూలాధారాలైన వేదాలను దివ్యజ్ఞాన సంపన్నులైన మహర్షులు అనుశ్రుతంగా, వాగ్రూపం ద్వారా పరిరక్షించారు. కేవలం మౌఖిక ప్రచారమే ఆధారంగా నిలిచిన జానపద వాఙ్మయం కాల ప్రవాహంలో వైవిధ్యంలో పెరిగి, విరిగి, తరిగి, కరిగి నేటికీ సజీవమై జానపదుల నాలుకలపై జాలువారుతున్నది.

జానపద వచన కథలను ఎందరో పండితులు ఎన్నో విధాలుగా వర్గీకరించారు. ప్రధానంగా సాంఘిక కథలు, ఐతిహ్యాలు, పురాణాలుగా వర్గీకరించారు. జానపద వచన కథలలో కల్పనాశక్తి, కుతూహలం, వివిధ రసాల సమ్మేళనం కనిపిస్తాయి. ప్రపంచ జానపద వచన కథా సాహిత్యం మీద సమగ్రమైన అధ్యయనం జరిగింది. వీరిలో గ్రిమ్ సోదరులు, బెన్ఫ్, స్టిత్ థాంప్సన్, ఆర్.ఎస్.బాగ్స్, ఆంటీ ఆర్నే ప్రముఖులు. ప్రపంచంలోని కథలకు భారతీయ కథలే మూలాధారమని చెప్పేది బెన్ఫ్ సిద్ధాంతం. కొందరు పండితులు ఈజిప్టు కథలే భారతీయ కథల కంటే ప్రాచీనమని భావించారు. ఏకమూలవాదం, బహుళోత్పత్తివాదం, స్వప్నమాల వాదం, ఆచరణాత్మక వాదం మొదలైన ఉత్పత్తి వాదాలు జానపద కథల సమగ్ర అధ్యయనానికి ఉపకరిస్తాయి.

## 2. జానపద కథలు - లక్ష్యం - లక్షణాలు

సృష్టిలోని ప్రతి కార్యంలో ఆధార, ఆధేయాలు ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటాయి. అట్లే సాహిత్యంలోని ప్రతి ప్రక్రియకు లక్ష్య, లక్షణాలను లాక్షణికులు నిర్ధారించారు. జానపద విజ్ఞాన వేత్తలనే కాక, మానవ శాస్త్రజ్ఞులను, మనస్తత్వ వేత్తలను, భాషాశాస్త్రవేత్తలను ఆకర్షించిన ప్రత్యేక జానపద సాహిత్య ప్రక్రియ “జానపద కథ” ఈ జానపద కథకు కూడా ప్రత్యేక లక్ష్య, లక్షణాలున్నవి.

### 2.1 జానపద కథా లక్ష్యం

జానపద కథలు పిల్లలకు, పెద్దలకు వయోభేదం లేకుండా మనోరంజనాన్ని కలిగిస్తాయి. నీతిని బోధిస్తాయి. కాలక్షేపం కొరకు ఉపకరిస్తాయి. జానపద కథల ప్రధాన లక్ష్యం - జాతి యొక్క సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, ప్రాంతీయ చరిత్రలను ఒక తరం నుంచి ఇంకొక తరానికి అందించుట, నీతిని, ధర్మాన్ని ఉపదేశించుట.

### 2.2 జానపద కథా లక్షణాలు

జానపద కథలకు నియమితమైన లక్షణాలు చెప్పడం కష్టం. సాధ్యమైనంతవరకు జానపద వచన కథల లక్షణాలను యిట్లు వివరించవచ్చు.

1. జానపద గేయాల వలెనే జానపద వచన కథలు కూడా మౌఖిక ప్రచారం ద్వారానే జీవిస్తాయి.
2. జానపద కథలు పరిణత స్వరూపం లేదా నియమిత స్వరూపం లేక వివిధ రూపాలు కలిగి ఉంటాయి. అంటే జానపద కథలకు లెక్కలున్నవి.
3. జానపద కథలలో సరళత, స్పష్టత ఉంటుంది.
4. దేశీయ ఇతివృత్తాన్ని కలిగి ఉండి, జానపదీయంగా వుండి, సార్వజనీనంగా ఉంటాయి.
5. జన ప్రియత్వాన్ని కలిగి ఉండి, సార్వజనీనమైన ఆకర్షణ శక్తిని కలిగి ఉంటాయి. అందుకే జానపద కథలు అంతరించిపోకుండా ఉన్నాయి.
6. ప్రతి జానపద కథ ఏదో ముఖ్య సంఘటన మీద కేంద్రీకృతమై ఉంటుంది.

7. జానపద గేయాల వలెనే జానపద కథలకు కూడా కర్త తెలియదు. కథకుడు కర్ణాకర్ణిగా విన్న కథలను చిలువలు పలువలుగా చేసి వర్ణించవచ్చు.
8. పశుపక్ష్యాదుల పాత్రల ద్వారా, మానవీకరించిన ప్రకృతి పాత్రల ద్వారా అన్యాపదేశంగా నీతిని బోధించేవిధంగా ఉంటాయి.
9. సమస్యాత్మకాలైన కథల్లో పొడుపు, విడుపు ఉండి మెదడునకు మేతవేయు విజ్ఞానపు గనులుగా జానపద కథలు గోచరిస్తాయి.
10. జానపద కథలు, శృంగార, హాస్య, అద్భుత, వీర రస ప్రధానంగా ఎక్కువగా కనిపిస్తాయి.
11. అజ్ఞాత కర్తృత్వం, సామూహిక ప్రచారం, మౌఖిక సంప్రదాయం, ప్రాచుర్యం, సారళ్యం, జనప్రియత్వం జానపద కథల ప్రధాన లక్షణం.
12. జానపదుల జీవితంలో మూఢ విశ్వాసాలు, ఆచారాలు, సంస్కృతిని అంతర్లీనంగా కలిగి ఉండి, పౌరాణిక వాసన కలిగి మత నిష్ఠను బోధిస్తాయి. జానపదుల జీవన విధానానికి ప్రతిబింబాలు మరియు ఎప్పటికీ యింకిపోని జలాశయాల లాంటివి జానపద కథాకాసారాలు.
13. జానపద కథలు అతిత్వరగా పయనించి, వలసపోయి కొత్తచోట్ల విస్తరిస్తాయి. అందువల్ల అనేక మార్పులకు, చేర్పులకు, కూర్పులకు లోనవుతాయి.
14. మనస్తత్వ చిత్రణాత్మకమై కూడా రూపుదిద్దుకోవచ్చు.
15. సాధారణంగా కథ "ఒక ఊళ్లో ఒక రాజున్నాడు" లేక "అనగనగా" లేదా "ఉన్నంగ ఉన్నంగ" అని ప్రారంభమవుతుంది. "అందరూ సుఖంగా ఉండిరి" లేక "అందరూ చాలా కాలం సుఖంగా కాలక్షేపం జేసిరి" లేక "కథ కంచికి వెళ్ళింది మనం ఇంటికి వెళ్లాము" లేక "కథకు కాళ్ళు లేవంట, ముంతకు చెవులు లేవంట, మనిద్దరికి ఓపిక లేదంటూ పోదాం పా" లేదా "కథను దొంగ లెత్తుకుపోయిరంట, మీ అత్తను దొమ్మరోళ్ళు ఎత్తుకుపోయిరంట" అని ముగుస్తుంది.

జానపద కథలకు లక్షణాలను నిర్దేశించిన పాశ్చాత్య జానపద విజ్ఞానవేత్తలు చాలా మంది ఉన్నారు. వారిలో బహుజన సమ్మతంగా లక్షణాలను నిర్దేశించినవాడు "ఆక్సిల్ ఓల్రిక్!"

జానపద కథా ప్రస్థానంలో ప్రముఖులు ఇద్దరు. వీరు జనపద కథకుడు, శ్రోత. వీరిద్దరు జానపద కథా కథానికి రెండు చక్రాల వంటివారు. అందువల్ల జానపద కథకుడు, శ్రోతల లక్షణాలను కూడా తెలుసుకుందాం.

### 3. జానపద కథకుడు - లక్షణాలు

1. జానపద కథకుడు మాటకారితనం కలిగి ఉంటాడు.
2. కథకుని కథా కథనం ఒక కళ.
3. తన అనుభవాలను కథలుగా అల్లి శ్రోతను ఆకట్టుకుని కథాకథన నైపుణ్యంతో ఉంటాడు. శ్రోతల మనస్తత్వాన్ని తెలిసికొంటాడు.
4. కథను చక్కని ప్రాంతీయ భాషలో జనుల వ్యవహార భాషలో చెప్పి శ్రోతలను తన వైపుకు తిప్పుకుంటాడు.
5. కథకుడు సామాజిక సంస్కర్తగా కూడా పని చేస్తాడు.
6. కథకుడు కథా సాహిత్య నిర్మాతగా ఒప్పుతుంటాడు.
7. యాదృచ్ఛికంగానే అతని కథా కథనంలో చక్కని సామెతలు, నానుడులు, జాతీయాలు, అలంకారాలు, బహిర్గతమై శ్రోతలను ఆనందపరుస్తాయి.
8. కొన్ని సందర్భాలలో శ్రోత యొక్క శ్రద్ధను గమనించడానికై కథా కథనం ప్రశ్న జవాబుల ద్వారా కూడా నడుస్తుంది.

9. కథా కథనం చేసే సందర్భంలో కథకుడు ఆయా రసానుగుణంగా లీనమై ఎంతో ఆవేశంతో చెప్పి శ్రోతలను కూడా రసోన్ముఖులను చేస్తాడు.
10. కొన్ని సన్నివేశాలలో కథకుడు ఏకపాత్రాభినయం చేస్తూ, హాస్య రసాన్ని చిప్పిల చేస్తుంటాడు.
11. కొన్ని సందర్భాల్లో హావ, భావ విలాసాలతో, సైగలతో కూడా కథను రక్తి కట్టిస్తాడు.
12. ప్రతి జానపద కథకుడు మనకు మంచి అభినివేశం గల నటునిగా గోచిరస్తాడు.
13. నైపుణ్యంగల జానపద కథకుడు తాను చెప్పబోవు కథను రక్తి కట్టించడానికి, శ్రోతలకు ఆనందాన్ని కలుగజేయడానికి సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాడు. అందువల్లనే కథా కథనం, కథా శ్రవణం నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి.

#### 4. జానపద శ్రోత - లక్షణాలు

1. జానపద కథకుడు, శ్రోత జానపద కథా రథానికి రెండు చక్రాల లాంటివారు. శ్రోత మీద ఆధారపడి కథకుని ఉత్సాహం పెరుగుట, విరుగుట జరుగుచుండును.
2. జానపద శ్రోత ఎంతో శ్రద్ధతో కథ వింటూ, మధ్య మధ్యన తనకు వచ్చే సందేహాలను నివారించుకుంటాడు.
3. నిజ జీవితంలో కథకుడు, శ్రోత ఎవరైనప్పటికీ, కథలు చెప్పుకొనే సందర్భంలో మాత్రం శ్రోత తాదాత్మ్యాన్ని పొంది కథను వింటుంటాడు.
4. శ్రోత ఎంత అప్రమత్తంగా వింటూ, ఊకొడితే కథకుడు అంత ఉత్సాహంగా కథను నివేదించగలుగుతాడు. అంటే శ్రోత్రేంద్రియం, మనస్సు ఆరోగ్యంగా ఉంటాయి.
5. కొత్త విషయాలను కథల ద్వారా నేర్చుకొని ఇతరులకు చెప్పి వారి మెప్పును పొందాలి అను జిజ్ఞాస శ్రోతను శ్రద్ధగా వినునట్లు చేస్తుంది. అంటే శ్రోత ఉత్కంఠత కలిగి ఉంటారు.
6. శ్రోతలు ఎక్కువగా చిన్న పిల్లలు అద్భుత రస ప్రధానమైన కథను, పెద్దలు శృంగార రస ప్రధానమైన కథలను కోరుకుంటారు. అంటే శ్రోత రసానుకూల మనస్తత్వం కలిగి ఉంటాడు.

చక్కని కథలు ఆవిర్భవించడానికి కథకులకు, శ్రోతలకు మధ్య అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. భారతదేశానికి పట్టుకొమ్మలైన పల్లెటూళ్ళలో మౌఖిక ప్రచారం ద్వారా జానపద కథలు ఇంకా సజీవంగా జీవిస్తున్నాయి. పల్లెటూళ్ళలో పల్లీయులు వేసవి కాలంలో వ్యావసాయిక సంబంధాలైన పనులు ఎక్కువగా ఉండనందువల్ల తీరికగా ఉంటారు. తీరిక సమయాల్లో వేసవి వెన్నెలలో యువకులు, యువతులు, బాలబాలికలు, మధ్య వయస్కులు కూడా శ్రవణ కుతూహలంతో ఒక చోట చేరుతుంటారు. అప్పుడు లోకజ్ఞత, భావుకత కలిగి చక్కని కథలు అల్లి చెప్పే నేర్పుగల వయస్సులో పెద్దవాడైన కథకుడు వారికి రమణీయంగా కథలను చెప్తాడు. యువతీ యువకులకు కుతూహలంతో పాటు నీతిని, కొంత లోకజ్ఞానాన్ని కూడా కథల ద్వారా బోధిస్తాడు. చక్కని వాక్చాతుర్యంతో అన్ని పాత్రలను అభినయిస్తూ నటనా సామర్థ్యాన్ని కలిగి ఉండి, పిల్లలను, యువకులను అద్భుత కథలతో ఆశ్చర్యచకితులను చేస్తాడు. రాత్రి సమయాల్లో ఊరి రచ్చబండ దగ్గర చక్కని కథలతో కథాకథన నైపుణ్యం గల కథకుడు పెద్దలకు, పిన్నలకు కూడా వినోదాన్ని కలిగిస్తూ కాలక్షేపం చేసే ఆచారం యింకా పల్లెటూళ్ళలో సజీవంగా ఉంది.

పంట చేతికొచ్చిన తర్వాత పొలాల్లో కళ్ళాలను ఊడ్చే సమయంలో, కాలినడకన ప్రయాణం చేసేటప్పుడు, వరిచేలు కోసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, వరినాటు

వేసేటప్పుడు, రాత్రి సమయాలలో పిల్లలను ఓదార్చడానికి అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు ప్రయత్నం చేసేటప్పుడు కథలు అమృత రసవాహినులుగా జానపదుల గుండెల నుండి నిసర్గమనోహరంగా ప్రవహిస్తాయి. ఈ కథలు వస్తువైవిధ్యం కలిగి ఉండి, కల్పనలు, చమత్కారాలను అంతర్లీనం చేసుకొని సంఘం, దేశంలోని ప్రజల జీవిత విధానాన్ని సంస్కృతిని ప్రతిబింబిస్తాయి.

రమ్యంగా కథలు చెప్పు జానపద కథకుడు, వారికి ద్విగుణీకృత ఉత్సాహాన్ని కలిగిస్తూ విసే శ్రోతలు పల్లె పట్టులలో, నగరాలలో ఉన్నంత వరకు జానపద కథలు నిరంతరం ప్రవహిస్తూ కథా స్రవంతులుగా సజీవంగా ఉంటాయి. ఆయా దేశాల సంస్కృతిని కొంత వరకు తెలుసుకోవడానికి ఆధారాలై ఉంటాయి. అందువల్ల మన సాహిత్యంలో ఒక భాగమైన యీ కథా భాండాగారాన్ని ప్రపంచీకరణ బారినుండి పరిరక్షించు కోవలసిన బాధ్యత మనందరిపై ఉన్నది.

**ఆధార గ్రంథాలు**


1. మహబూబ్‌నగర్ జిల్లా జానపద కథలు – డా॥ బుక్కా బాలస్వామి.
2. తెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు – డా॥ రావి ప్రేమలత.
3. తెలుగు జానపద గేయ గాథలు –
4. ఆచార్య నాయని కృష్ణకుమారి.